తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-08- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 73 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# బీజేపీ అడ్డుకుంటోంది



- రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోదీ, అమిత్‌షా అడ్డుకున్నారు
- రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దక్కకపోవడం బాధాకరం
- బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలుపాలని డిమాండ్ చేస్తూ.. కాంగ్రెస్ నేతలు అందరూ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. నిన్న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. అయితే నిన్న మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోదీ, అమిత్‌షా అడ్డుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దక్కకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎప్పుడూ అన్యాయం చేస్తూనే ఉందని విమర్శించారు. రిజర్వేషన్లపై బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి ధర్నాలో బీఆర్ఎస్ ఎందుకు పాల్గొనలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.ధర్నాలో పాల్గొనకపోగా అవహేళన చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. కులగణనలో సంపూర్ణ వివరాలు సేకరించామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. బీసీ జనాభా లెక్కలు తెలుసుకునేందుకే కులగణన చేసినట్లు తెలిపారు. ఆ తరువాతే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామన్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు.

మిగతా 2లో

# కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వం

- బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామన్న పొన్నం ప్రభాకర్
- ముస్లింల పేరుతో అడ్డుకోవడం సరికాదని వ్యాఖ్య
- ఉత్తరాదిన అనేక రాష్ట్రాల్లో బీజేపీని బీసీలు తిరస్కరించారన్న పొన్నం



న్యూఢిల్లీ:, (తెలంగాణ ముచ్చట్లు)

బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. ధర్నా శిబిరానికి ఢిల్లీలోని పలువురు పార్టీ పెద్దలు తరలి వచ్చారు.

కాసేపటి క్రితం ఢిల్లీలో మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వబోమని అన్నారు.

మిగతా 2లో



# తెలంగాణలో మూడురోజులు భారీ వర్షాలు

**ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ**

తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురువారం నల్గొండ, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. ఉరుములు, మెరుపులు,

2లో



# అందరి లెక్కలు సరి చేస్తాం

- మరో రెండేండ్లలో మళ్లీ అధికారంలోకి వస్తాం
- రేవంత్ రెడ్డి కంటే ఎక్స్‌ట్రాలు చేసే వారందరి పేర్లు బరాబర్ రాసి పెట్టుకుంటాం
- ఐఏఎస్, ఐపీఎస్‌లకు కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరో రెండేండ్లలో మళ్లీ అధికారంలోకి వస్తాం.. అందరి లెక్కలు సరి చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. పరిగి నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉండే కలెక్టర్లు, పోలీసు అధికారులకు ఒక్కటే చెబుతున్నా.. పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. ఖైరతాబాద్‌లో మొన్న రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ కలిసి చిలుక పలుకులు మాట్లాడుతున్నారు.

2లో

# రిజర్వేషన్ల పేరుతో ఎవరిని మోసం చేయాలనుకుంటున్నారు

- తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ..
- ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు
- అప్పుల కోసం రేవంత్ సర్కార్ అర్రులు చాస్తోంది
- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్

ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. అప్పుల కోసం రేవంత్ సర్కార్ అర్రులు చాస్తోందంటూ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిస్సాహాయతను కేంద్రంపై రుద్దే ప్రయత్నం చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ హామీలకు రేవంత్ మాత్రమే బాధ్యులు కాదు.. రాహుల్, సోనియా కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క డిక్లరేషన్‌ను అమలుచేయడం లేదని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. మైనార్టీ, యూత్, రైతు, బీసీ డిక్లరేషన్‌లో పేరుతో ఆయా వర్గాలను మోసం చేశారని విమర్శించారు. ఈ డిక్లరేషన్‌లన్నీ ఏమైపోయాయని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తామని అన్నారు, ఏమైందని

మిగతా 2లో





# ఉపాధ్యాయుల పదోన్నతులపై హైకోర్టు స్టే

- ఉపాధ్యాయుల పదోన్నతుల్లో సినియారిటీ వివాదం
- ఈ నెల 11వ తేదీ వరకు పదోన్నతులు ఇవ్వకుండ ఆపాలని హైకోర్టు స్టే

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. కొందరు టీచర్లు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ వరకు పదోన్నతులు ఇవ్వకుండా స్టే విధించినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిరచాయి. ఈ నెల 4వ తేదీ నుంచి పదోన్నతుల

మిగతా 2లో

# సిట్ ముందుకు వెళ్లనున్న బండి సంజయ్

**ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు నేతలను విచారించిన సిట్ వారి నుంచి వాంగ్మూలాలను సేకరించిన విషయం తెలిసిందే.. అయితే తాజాగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను సిట్ విచారించనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను రేపు సిట్ అధికారులు విచారించనున్నారు.

మిగతా 2లో



# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోండి..

## డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. గత నెల ఒక పబ్లిక్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది కారుపోతుల రేవంత్ ఫిర్యాదు చేయడం జరిగింది. రేవంత్ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కమిషన్.. మహిళా ఎమ్మెల్సీపై అనాలోచితంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల్లో నివేదికను సమర్పించాలని డీజీపీకి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

# దేశంలో మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ

- తొలిసారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల తర్వాత దేశంలో మూడో అతిపెద్ద ఈ-వ్యర్థాల ఉత్పత్తిదారుగా నిలిచిన తెలంగాణ
- వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఈ రోజుల్లో సెల్ ఫోన్ మానవ జీవితంలో భాగమైపోయింది. అది లేకుండా రోజు గడవడమే కష్టంగా మారింది. దానికి తోడుగా ఇయర్ బడ్స్, స్మార్ట్ వాచ్ ఇలా ఇంట్లో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటున్నాయి. వాటికి ఏదైనా సమస్య వస్తే చాలా వరకు రిపేర్ చేయిస్తాం. అప్పటికీ సమస్య తీరకపోతే దాన్ని పారవేస్తాం. దీనివలన దేశంలో రోజురోజుకూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల ముప్పు పెరుగుతోంది.

2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)



అసెంబ్లీలో బీసీ బిల్లుపై తీర్మానం చేసే సందర్భంలోనే కిషన్ రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పి ఉంటే... ఆరోజు చర్చ జరిగేదని చెప్పారు. ఆ బిల్లు చట్ట రూపం దాల్చి, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీకి వచ్చిన తర్వాత... ముస్లింల పేరుతో దాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు. కిషన్ రెడ్డిని కూడా బహిరంగ చర్చకు ఆహ్వానించదలుచుకున్నామని చెప్పారు.
లోక్ సభ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా బీజేపీ గెలిచిందని పొన్నం ఎద్దేవా చేశారు. ఉత్తరాదిన అనేక రాష్ట్రాల్లో బీజేపీని బీసీలు తిరస్కరించారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు.

# ఉపాధ్యాయుల పదోన్నతులపై హైకోర్టు స్టే

(మొదటి పేజీ తరువాయి)



ప్రక్రియ ప్రారంభం కాగా 11వ తేదీలో పూర్తి కావాల్సి ఉంది. దాదాపు 3,800 మందికి పైగా ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా, గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతులు లభించాల్సి ఉంది. ఈ క్రమంలో ఓ కొత్త వివాదంతో ప్రక్రియకు తాత్కలికంగా బ్రేక్ పడిరది. ఉమ్మడి రాష్ట్రంలో 2002లో డీఎస్సీ ద్వారా కొందరు ఉపాధ్యాయులు అదే ఏడాది అక్టోబరు 17న స్కూల్ అసిస్టెంట్లుగా విధుల్లోకి చేరారు. అదే సంవత్సరం నవంబరు 1న కొందరు టీచర్లు ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. నిబంధనల ప్రకారం విధుల్లో చేరిన తేదీ ప్రకారం సీనియారిటీని నిర్ణయిస్తారు. దీని ప్రకారం డైరెక్ట్ రిక్రూట్ మెంట్ ద్వారా నియమితులైనవారు సీనియారిటీ జాబితాలో ముందున్నారు. దీనిపై స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందినవారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.
2002 డీఎస్సీ నోటిఫికేషన్ కంటే ముందు పదోన్నతుల షెడ్యూలు జారీ అయిందని, దానికితోడు పలుమార్లు వాయిదా పడిరదని, అందువల్ల 2002 డీఎస్సీ ద్వారా నియమితులైనవారి కంటే తామే సీనియర్లమని వారు వాదిస్తున్నారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ నెల 11వ తేదీ వరకు పదోన్నతుల ప్రక్రియపై హైకోర్టు స్టే విధించింది. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో ఉత్తీర్ణులు కానివారికి పదోన్నతులు ఇవ్వరాదని, పాఠశాల విద్యాశాఖ దాన్ని అమలు చేయడం లేదని కొందరు టీచర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపైనా స్పష్టత రావాల్సి ఉంటుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పదోన్నతుల ఖాళీతో అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా డీఎస్సీ2012 తర్వాత పీఈటీ, భాష పండిట్ లకు కూడా అప్‌గ్రేడ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరు దాదాపు రాష్ట్రంలో 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వ అనుమతించినట్లు సమాచారం, ఇలా దాదాపు 2వేల మంది ప్రమోషన్లు పొందే అవకాశం ఉంది. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఉన్న ఖాళీల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేకపోవడం వల్ల ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ప్రయత్నిస్తోంది. విద్యాశాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే అంటి పెట్టుకుని పర్యవేక్షిస్తున్నారు.

# బీజేపీ అడ్డుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)



బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో..42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు బిల్లులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చట్టం చేసిందని, చేసిన చట్టాన్ని అధిగమించేందుకే ఆర్డినెన్స్ తీసుకొచ్చినట్లు చెప్పారు. 4 నెలలు గడుస్తున్నా బిల్లులను రాష్ట్రపతి ఆమోదించలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం క్షేత్రస్థాయిలో అన్ని ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. శాసనసభలో ఏకగ్రీవ ఆమోదంతోనే చట్టాలను ఢిల్లీకి పంపామని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై జాతీయ స్థాయిలో పోరాడాలనే ఢిల్లీకి వచ్చామని రేవంత్ వెల్లడిరచారు.
నిన్నటి ధర్నాకు 100 మందికిపైగా ఎంపీలు మద్దతు ప్రకటించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే.. ధర్నాకు మద్దతు తెలిపిన డీఎంకే, ఎన్సీపీ ఎస్పీ ఇతర పార్టీల నేతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. కులగణన మోడల్‌ను రాహుల్, ఖర్గే ప్రశంసించారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు అందరూ జంతర్ మంతర్ నిరసన కార్యక్రమంలో కులాలకు అతీతంగా పాల్గొన్నారని తెలిపారు.

# తెలంగాణలో మూడురోజులు భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)



గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది. శుక్రవారం నల్గొండ, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. శనివారం నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని హెచ్చరించింది ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి, భువనగిరిలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని టీజీడీపీఎస్ పేర్కొంది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో 7.2 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది.తెలంగాణవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి, భువనగిరిలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని టీజీడీపీఎస్ పేర్కొంది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో 7.2 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది.

# అందరి లెక్కలు సరి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెసోళ్లు మాట్లాడినట్లు మాట్లాడుతున్నారు. ఎక్కువ సమయం లేదు. మరో రెండున్నరేండ్లలో మళ్లీ మేమే వస్తాం. ఎవరైతే ఎగిరెగిరి పడుతున్నారో.. రేవంత్ రెడ్డి కంటే ఎక్స్‌ట్రాలు చేసే వారందరి పేర్లు బరాబర్ రాసి పెట్టుకుంటాం. ప్రతి ఒక్కరి మాటలు యాది పెట్టుకుంటాం. అన్ని లెక్కలు సెటిల్ చేసే బాధ్యత నాది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కష్టపడి తెలంగాణ సాధించుకున్నాం. సాధించుకున్న తెలంగాణను అద్భుతంగా తయారు చేసుకుంటూ వచ్చాం. తండాలను పంచాయతీలు చేస్తామని కాంగ్రెసోళ్లు చెప్పిన కాలేదు. కానీ కేసీఆర్ హయాంలో తండాలు పంచాయతీలు అయ్యాయి. కొత్త మండలాలు, జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. ఇవాళ వికారాబాద్‌లో కూడా కలెక్టరేట్ ఏర్పాటు చేసుకున్నాం. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మన కలెక్టరేట్‌లను ప్రశంసించారు. ఇతర రాష్ట్రాల్లోని సెక్రటేరియట్‌లు కూడా తెలంగాణలోని కలెక్టరేట్ల మాదిరి లేవన్నారు. ప్రతి గడప ముందుకు పాలన తీసుకొచ్చారు కేసీఆర్. ప్రతి ఊరిలో రైతు వేదిక, ప్రకృతివనాలు, స్మశానవాటికలు, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకున్నాం. రైతులకు 24 గంటల ఉచితంగా కరెంట్ ఇచ్చారు. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు అని కేటీఆర్ గుర్తు చేశారు.
మనం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించడంలో మనం ఫెయిలయ్యాం. పదేండ్లలో సాధించిన ప్రగతిని చెప్పుకోలేకపోయాం. అవతలోడు వచ్చి ఆశచూపెట్టి గెలిచిండు. గెలిచాక ఏం చేస్తలేడు. కాంగ్రెస్‌ను నమ్మి ఇవాళ బాధపడుతున్నారు. కార్యకర్తల్లాగా మనం చేయాల్సిన పని ఒక్కటే. కేసీఆర్‌కు సీఎం కొత్త పదవి కాదు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో ఈ దుర్మార్గుల ప్రవర్తన వల్ల మళ్లీ 15 ఏండ్లు వెనక్కి పోయే ప్రమాదం ఉంది. అందుకే తెలంగాణను మళ్లీ పట్టాలెక్కించాలంటే కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలి. కార్యకర్తలందరం కలిసి పని చేద్దాం. వికారాబాద్ జిల్లాలో భూముల ధరలు తగ్గాయి. రాష్ట్రంలో ఎక్కడా కూడా ఒక మనిషి సంతోషంగా లేడు. తినే అన్నంలో మన్ను పోసుకున్నట్టు ఉందని రైతులు అంటున్నారు. గిట్టుబాటు ధర లేదు. ఎరువులు, విత్తనాలు దొరకడం లేదు. యూరియా కోసం లైన్లలో చెప్పులు పెట్టి ఎదురు చూసే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ పేర్కొన్నారు.



# రిజర్వేషన్ల పేరుతో ఎవరిని మోసం చేయాలనుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)..

హామీలు అమలుచేయకుండా ఢిల్లీ బాట పట్టి స్థాయికి మించి మాట్లాడుతున్నారంటూ పేర్కొన్నారు. 42% బీసీ రిజర్వేషన్ల అమలులో చట్టబద్ధతలను సీఎం రేవంత్ రెడ్డి పరిగణనలోకి తీసుకోలేదని.. తెలంగాణ సీఎం రాజకీయంగా, పరిపాలనాపరంగా, ఆర్థికంగా విఫలమయ్యారని కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో ముస్లింలకు 4% రిజర్వేషన్లు కల్పించినప్పుడు హైకోర్టు మత ఆధారిత రిజర్వేషన్లను కొట్టివేసిందంటూ కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ 10% ముస్లిం రిజర్వేషన్లను జోడిరచడం ద్వారా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను కేసీఆర్ కాలానికి ముందు 34% నుండి 32%కి తగ్గించిందన్నారు. 18 నెలల్లో రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు ఏం చేశారో చెప్పాలంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. అద్దాల మేడలో కూర్చొని రాహుల్, రేవంత్ ఇతరులపై విమర్శలు చేస్తున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. సామాజిక సాధికారిత కల్పించే విషయంలో రేవంత్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో మళ్లీ ఎన్నికలు వస్తే, ఏ రాష్ట్రంలో అయినా కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ జీరో పార్టీగా మారిపోయిందన్నారు. తెలంగాణ ప్రజలు పొరపాటు చేశామని పశ్చాత్తాప పడుతున్నారని.. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన మీటింగ్.. సోనియా ఫ్యామిలీని పొగడటానికి, ప్రధాని మోదీని విమర్శించడానికి తప్పా ఎవరికి ఒరిగింది ఏమీ లేదన్నారు.
అవినీతిలో కాంగ్రెస్‌బీఆర్ఎస్‌తో పోటీ పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ హోల్ సేల్ అవినీతికి పాల్పడితే.. కాంగ్రెస్ రిటేల్‌గా అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. గతంలో ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు కేసీఆర్ ప్రయత్నించారు.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల పేరుతో ఎవరిని మోసం చేయాలనుకుంటున్నారో చెప్పాలన్నారు. మతపరమైన రిజర్వేషన్లు పెట్టి.. మత కల్లోలాలు తీసుకు రావాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు.

## సిట్ ముందుకు వెళ్లనున్న బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)..

అనంతరం ఆయన వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేయనుంది. ఈ నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ విచారణపైగురువారం కేంద్ర హోం శాఖ అధికారులు ఆయనతో భేటీ అయ్యారు. కేంద్ర హోం శాఖ అధికారులు ఫోన్ ట్యాపింగ్ విచారణపై ఆయనతో చర్చింస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ భేటీలో మాజీ పోలీస్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందన్న ఆరోపణలపై సిట్ విచారణ కొనసాగుతుంది. అయితే గతంలో తన ఫోన్, బంధువుల ఫోన్‌లు ట్యాప్ చేయబడ్డాయని బండి సంజయ్ ఆరోపించారు. ఇప్పటికే పలువురిని విచారించిన సిట్ ఆయన చేసిన ఆరోపణలపై బండి సంజయ్‌ను విచారించనుంది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఉన్న విషయం తెలిసిందే.

# దేశంలో మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)..

ఏటా వ్యర్థాలు పోగుపడుతుంటే, రీసైక్లింగ్ ప్రాసెస్‌లో సరైన విధానాలు అవలంభించక సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలు వాడి పారేస్తున్న సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడంలో పీసీబీ, మున్సిపల్, ఇతర విభాగాల ఆలసత్వం, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. మనం వాడి పడేసిన బ్యాటరీలు జలాశయాలను సైతం కలుషితం చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతోంది. మొదటి సారిగా లక్ష మెట్రిక్ టన్నులను దాటి ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల తర్వాత దేశంలో మూడో అతిపెద్ద ఈవ్యర్థాల ఉత్పత్తిదారుగా రాష్ట్రం నిలిచిందని లోక్‌సభలో పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వశాఖ వెల్లడిరచింది. వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం నాటికి 1.19 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందని వెల్లడిరచింది. ఈ వ్యర్థాలన్నీ ఐటీ రంగానికి కేంద్రంగా ఉన్న రాజధాని నగరం నుంచే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పింది. ఈవ్యర్థాల పునర్వినియోగం కోసం కాలుష్య నియంత్రణ మండలి 31 సంస్థలకు అనుమతులిచ్చింది. కాగా అందులో 20కి పైగా సంస్థలు రాజధాని పరిధిలోనే ఉన్నాయి. ఈ సంస్థలకు ప్రతి సంవత్సరం 2.25 లక్షల టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే సామర్థ్యం ఉంది. అయినా 40 వేల మెట్రిక్ టన్నులకు మించి రీసైక్లింగ్ చేయడం లేదు. కాగా పీసీబీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 202324లో ఎక్స్‌టెండెంట్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)లో భాగంగా 63,635 మెట్రిక్ టన్నుల ఈవ్యర్థాలను సేకరించారు. ప్రాసెస్ చేసిన ఈ వ్యర్థాల్లో రాగి, ఇనుము, బంగారం, అల్యూమినియం వంటి లోహాలు 24,497 మెట్రిక్ టన్నులుండగా ఇతర వ్యర్థాలు 24,433 మెట్రిక్ టన్నులు ఉన్నాయని పేర్కొంది.



ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి విషపూరిత పదార్థాలుంటాయి. వీటిని రీసైకిల్ చేయకపోతే గాలి, నీరు, నేలని కలుషితం చేస్తాయి. నీటి వనరుల్లో సీసం కలిస్తే కాలుష్యానికి దారి తీయడంతో పాటు నీటిలో ఉండే జీవుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ రసాయనాలు నేలలో చేరి దాని సారాన్ని దెబ్బతీస్తాయి. వీటిని కాల్చడం, అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయడం వల్ల డైఆక్సిన్‌లు, ఫ్యూరాన్లు వంటి విషపూరిత వాయువులు విడుదలై గాలిని కలుషితం చేస్తాయి. దీంతో క్యాన్సర్, నాడీ వ్యవస్థ రుగ్మతలు, శ్వాస కోశ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు దారితీస్తాయు.





# సత్తుపల్లి లో ఐఎన్టీయూసీ నల్ల బ్యాడ్జి లతో నిరసన!

◆ ఈసమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ వినతి పత్రం

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక సత్తుపల్లి పట్టణంలో సింగరేణి ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ సూచనతో గురువారం జే.వి.ఆర్ ఓసి కిష్టారం ఓసి, జే.వి.ఆర్ సి.హెచ్.పి లలో సత్తుపల్లి బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్, ఐఎన్టియూసి ఫిట్ కార్యదర్శిలు రామారావు, బాలాజీ, నాగేశ్వరరావు ల ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తూ ఉద్యోగుల పలు సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు.

ఉద్యోగుల ప్రధాన సమస్యలపై బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగులకు ప్లేడే ఎన్ 1, 50% పీహెచ్డీల ఎత్తివేత, మెడికల్ బోర్డు పునరుద్ధరణ, సొంత ఇంటి కల, 35 % లాభల వాటా, నూతన బొగ్గు గనులు, పెర్క్స్ పై ఆదాయ పన్ను రాయితీ, మారు పేర్లు మార్పు, ప్రమోషన్ పాలసీలు, ట్రాన్స్ఫర్ పాలసీ పునరుద్ధరణ లాంటి సమస్యల పరిష్కారానికి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఐఎన్టీయూసీ కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని తెలియజేశారు. ఐఎన్టీయూసీ యూనియన్ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడే విషయంలో, నూతన హక్కుల సాధనలో ఎల్లపుడు కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అశ్వక్, విశ్వేశ్వరరావు, కోటి, సురేష్, ఐ.వి రెడ్డి, చంద్రమౌళి, రత్నాకర్, రఫీ, కిషన్ రావు, రషీద్, బాలు, పొట్టి కిరణ్, చంద్రశేఖర్, వెంకటస్వామి, మురళి, రాజశేఖర్, కట్ట కృష్ణ, సదానందం, ఏ.రాజేశ్వరరావు, అప్రోచ్, గుత్తుల నవీన్, డి.శ్రీనివాస్, రాజశేఖర్, జితేందర్ రెడ్డి, యాకూబ్, నజీర్, హమీద్, హనుమంతు , చంద్రగిరి మోహన్ , ఎర్రబెల్లి ఈశ్వర్, ఈర్ల నగేష్, దొడ్డపల్లి రమేష్, బండి రామకృష్ణ , రావుల చంద్రశేఖర్, గుండె రమేష్, సంతోష్, కాల్ మధు, వేణు, భవాని శంకర్, ఉపేందర్, అశోక్, తుమ్మూరు నాగయ్య, దామోదర్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, మహేష్, ఎల్లం కోరి, సతీష్ రెడ్డి, వినోద్, అక్బర్, బాషా, గుడిపల్లి శ్రీనివాస్, ఆకుల వెంకటేశ్వర్లు, కొమురయ్య, పిచ్చయ్య , ఈ.శ్రీనివాస్ , చంద్రశేఖర్ ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కృష్ణ యాదవ్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన పరమేశ్వర్ రెడ్డి

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా ఎల్లారెడ్డిగూడకు చెందిన కృష్ణ యాదవ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు నాగశేషు, ఆకారపు అరుణ్, విఠల్ నాయక్, నాగరాజు, టిల్లు యాదవ్‌లు కూడా హాజరై కృష్ణ యాదవ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.







# మెనూ ప్రకారం భోజనం అందించాలి

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా.**

**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:**

పెనుబల్లి మండలం, ఉప్పలచలక గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ గురువారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాల పరిశుభ్రతను పరిశీలించారు. ఉపాధ్యాయుల రోజువారి హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రధాన ఉపాధ్యాయులు ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బావా బ్రోస్ బిస్త్రో రెస్టారెంట్ ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గంలో కాప్రా డివిజన్ లో సైనిక్ పూరి లో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా బావా బ్రోస్ బిస్త్రో రెస్టారెంట్ ప్రారంభించారు.బావా బ్రోస్ బిస్త్రో రెస్టారెంట్ నిర్వాహకులు ప్రీతమ్, మందుముల పరమేశ్వర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలందిస్తూ బావా బ్రోస్ బిస్త్రో రెస్టారెంట్ మంచి వృద్ధి సాధించాలన్నారు.నిర్వాహకులు ప్రీతమ్ కి శుభాకాంక్షలు తెలిపారు పరమేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆకారపు అరుణ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోలెపాక అంజయ్య , రాయని ఉదయ్ కిరణ్, సురేష్, జెమిని, మల్లేష్, రాజు, అనిల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.







# గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ దాడులను ఖండించండి

◆ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు

◆ ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశంలో సీజనల్ వ్యాధులపై అవగాహన

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ చేస్తున్న దాడులను ఖండించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు అన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మ గుడి వద్ద, దుశ్యంతరెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు పిట్టల నాగేశ్వరరావు, అనంతారపు వెంకటాచారిలు మాట్లాడుతూ... వైద్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకువెళ్లి, ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు, సూచనలు చేసి ఫస్ట్ ఎయిడ్ పరీక్షలు నిర్వహించి వారికి వెన్నుదన్నుగా, అండగా ఉంటున్న గ్రామీణ వైద్యులు నేడు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. అందుకే దేశంలో అన్ని ఉద్యమాలు వచ్చాయి కానీ వైద్య ఉద్యమం రాకపోవడానికి కారణం గ్రామీణ వైద్యులే అన్నారు. ఉమ్మడి జిల్లా నుండి వచ్చిన గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఈ సందర్భంగా నిర్వహించారు. గ్రామీణ వైద్యులకు గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన జీవో 429, 428, 1273 లను పునరుద్ధరించాలని, గ్రామీణ వైద్యులకు పారామెడికల్ శిక్షణను ఇప్పించి చట్టబద్ధత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా గ్రామీణ వైద్యులపై టిజిఎంసి దాడులను ఖండిస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ మణికుమార్, ఎన్ సుదర్శన్, జి వెంకటరామయ్య, కార్యదర్శి ఇంటూరి నాగరాజు, ప్రచార కార్యదర్శి బి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులు చంద్రారెడ్డి, టి రాము, కె. రాములు, యల్. శ్రీనివాసరావు, జి. వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ మియా, రాయల శ్రీనివాసరావు, ఎండి మహమ్మద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన తమ్మినేని వీరభద్రం ..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం గురువారం వైరా పట్టణంలో విస్తృతంగా పర్యటించారు, పలువురు పార్టీ సీనియర్ నాయకులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలు, యోగక్షామాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు, సోమవారం మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తాండ్ర పెద్ద బ్రహ్మంను పరామర్శించారు. తాండ్ర పెద్ద బ్రహ్మం వయోభారం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. వారి రెండవ కుమారుడు తాండ్ర అమీన్ పార్టీ శాఖ సభ్యులుగా పనిచేస్తున్నారు. అనంతరం పార్టీ వైరా పట్టణ నాయకులు కొంగర సుధాకర్ తల్లిదండ్రులు కొంగర సీతారామయ్య, లక్ష్మీ కాంతమ్మలను పరామర్శించారు. వారు ఇటీవల అనారోగ్యానికి వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ్మినేని వారితో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. తమ్మినేని వెంట పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, మెరుగు సత్యనారాయణ, వైర పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బొంతు సమత, కొంగర సుధాకర్, గుమ్మా నరసింహారావు, పైడిపల్లి సాంబశివరావు, మల్లంపాటి ప్రసాదరావు, తోట కృష్ణవేణి, కంసాని మల్లికాంబ, యనమద్ది రామకృష్ణ, వేల్పుల మైఖేల్, చిట్టోజు నాగేశ్వరరావు, కొంగర జగ్గయ్య, ఏలూరు ప్రభాకర్ రావు, చావా కళావతి, కురుగుంట్ల శ్రీనివాసరావు, వడ్లమూడి మధు, సోషల్ మీడియా వైరా డివిజన్ కన్వీనర్ గుడిమెట్ల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్ఆర్సీ 6వ వార్షికోత్సవ వేడుకలు

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

సైన్టిఫిక్ రీసెర్చ్ కమ్యూనిటీ (ఎస్ఆర్సీ) ఆరవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఆర్సీ సీఈఓ తన్నీరు శ్రీహరి తాను ఒంటరిగా ప్రారంభించిన సంస్థను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లి, ఆరవ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం అభినందనీయం అన్నారు. యువత సైతం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ, తమ స్వంతంగా స్టార్టప్‌లు స్థాపించి ఇతరులకు ఉపాధిని కల్పించాలని సూచించారు.

కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ, స్థానిక విద్యావంతులైన యువతచే స్థాపించబడిన ఎస్ఆర్సీ సంస్థ మల్కాజ్గిరి లోనే 70 మందికి ఉపాధి కల్పించడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, లోక్సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బి. శివరామకృష్ణ, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, కాంగ్రెస్ నాయకులు కొత్త అంజి రెడ్డి, సీపీఎం నాయకుడు కురునెల్లి వెంకట్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ పటేల్, కాప్రా ఎంపీయూపిఎస్ ప్రధానోపాధ్యాయులు వి. రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పి. పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, బాబురావు, కొబ్బనూరి నాగరాజు, శ్రీధర్ రెడ్డి, సంతోష్ చారి, జి. సత్యనారాయణ, తోటకూర శ్రీకాంత్, మూర్తుజా, బాలయ్య, ప్రదీప్, అహ్మద్, ఆకుల సంతోష్, మనోజ్ కుమార్, కనకరాజు, హరి, విజయ్, దయ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక నాయకులు ఎన్. మహేష్, సత్తయ్య, సత్యనారాయణ, కుమార్, రామకృష్ణతో పాటు సంస్థ ఉద్యోగులు హాజరయ్యారు.






తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రధాన రహదారి కల్వర్టు పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం లో చిల్కానగర్ ప్రధాన రహదారి లో 17 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యవేక్షించిన చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్. జిహెచ్ఎంసి అధికారు లతో మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలని, బాక్స్ డ్రైన్ పనులను త్వరతగతిన పూర్తయ్యే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఉప్పల్ నుండి చిల్కానగర్ నుండి ఎక్కువ మంది ప్రజలు ఉపయోగించే రోడ్డు కాబట్టి మరియు వేరే ప్రాంతాల కు వెళ్లడానికి కూడా ఇది ప్రధాన రహదారి కాబట్టి అధికారులు దీనిపై అధిక చొరవ చూపి వీలైనంత తొందరలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, షఫీ, గడ్డ బాలు ,బంటి గౌడ్ వర్క్ ఇన్స్పెక్టర్ కేదార మొదలగు వారు పాల్గొన్నారు.



# ఘనంగా పోతగాని గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలు

**నాచారం, తెలంగాణ ముచ్చట్లు:**

నాచారం డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలు డివిజన్ బిజెపి నాయకులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారి నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పార్టీలకు అతీతంగా నాయకులు, పలు కాలనీ సంఘాల సభ్యులు,కుల సంఘాల నాయకులు,జేఏసీ సభ్యులు,వ్యాపారవేత్తలు కాలానీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గోపాల్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

ఈ సందర్భంగా పోతగాని గోపాల్ గౌడ్ మాట్లాడుతూ నా జన్మదినాన్ని పురస్కరించుకొని నాకు ప్రత్యక్షంగాను,పరోక్షంగా పార్టీలకు అతీతంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ ప్రేమ,అభిమానం ఎల్లపుడు ఇలానే ఉండాలని ఆశిస్తున్నా అన్నారు. అదేవిదంగా అధికారం, పదవి ఉన్న లేకున్నా ఎల్లపుడు ప్రజ సేవలో, అందరికి అందుబాట్లో ఉంటానని నాచారం డివిజన్ అభివృద్ధి కి తోడ్పడతానని తెలియచేసారు.



# దశదిన కర్మలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ నాయకులు

**దమ్మపేట, తెలంగాణ ముచ్చట్లు:**

అశ్వరావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండలం, కొమ్ముగూడెం గ్రామంలో కోర్సా.సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం జరిగిన వారి దశదినకర్మ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం. రాజబాబు, ఎర్రయ్య, నరసింహారావు, వెంకన్నబాబు, బుద్దుల కృష్ణ, వెంకటేష్ , సురేష్ పలువురు పాల్గొన్నారు








# పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అమానుష దాడి

- దాడిని ఖండిస్తూ భారీ స్థాయిలో సంఘీభావ ర్యాలీ

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

పాలస్తీనా ప్రజలకు ఆహారం, నీరు, వెళ్లకుండా అడ్డుకుంటూ వేలాదిమంది ప్రజల ఆకలి చావులకు కారణమవుతున్న ఇజ్రాయిల్ అమానుష దాడిని నిరసిస్తూ గురువారం ప్రజాస్వామ్యక వాదులు, మేధావులు వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు, విద్యార్థులు, మహిళలు, ఖమ్మం ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీ నిర్వహించడం జరిగింది.




ఈ సంఘీభావ ర్యాలీలో సిపిఐ జాతీయ నాయకులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకనపల్లి వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, మైనార్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ హుస్సేన్, జమాతే ఇస్లామిక్ నాయకులు జైనుల్ పాషా, మహమ్మద్ ఇలియాస్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవి మారుత్, కాకి భాస్కర్, మువ్వ శ్రీనివాస్, ఐవి రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, డాక్టర్స్ ఎం.ఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న ఈ దాడుల మూలంగా గాజాలో ప్రజలకు నీరు,ఆహారం, మందులు, నిత్యవసర, సరుకులు, విద్యుత్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. చదువుకోవడానికి పాఠశాలలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ఆసుపత్రులను ప్రజలకు అందకుండా ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికీ గాజాలోని 20 లక్షల మంది ప్రజలు దుర్విద్యమైన జీవనం గడుపుతున్నారు. వేలాదిమంది ప్రజలు, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారని, అక్కడి ప్రజలకు ఆహారం అందించకుండా ఇజ్రాయిల్ ఆంక్షలు విధించి బాంబులతో రాకెట్ దాడులు చేస్తూ ఉండడం వలన ఆహారం అందకపోవడం వల్ల తమ ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. అక్కడి ప్రజలు నిరంతరం ఆక్రమణలు, ఆంక్షలు, దాడులను ఎదుర్కొంటున్నారు. గాజాకు పేరుకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూమి సముద్రం గగనతలంపై లెక్కలేనన్ని ఆంక్షలు విధించి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ఈ ర్యాలీలో న్యాయవాదులు తిరుమల రావు, శేషగిరి, విప్లవ కుమార్, సుగుణరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణ, ప్రవీణ్, వెంకటేష్ మస్తాన్ సురేష్, యువజన సంఘాల నాయకులు బషీర్, రామకృష్ణ, రాకేష్, రమేష్, మహిళా సంఘం నాయకులు బండి పద్మ, పోటు కళావతి, ఝాన్సీ, లక్ష్మి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆదినారాయణ, ఏనుగు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, ఖదీర్, చిర్ర రవి, సయ్యద్ కాశ్మీ, జలాలుద్దీన్ కాశ్మీ, ప్రసేన్, సీతారాం, అశోక్ తో పాటు వేలాదిమంది విద్యార్థులు ప్రజలు ప్రజాస్వామికవాదులు, మేధావులు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల, కళాశాల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.





# బాలాజీ మెడికల్ హాల్ నీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**ఏఎస్ రావునగర్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గంలో కాప్రా సర్కిల్ డా.ఏ ఎస్ రావునగర్ డివిజన్ కుషాయిగూడ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ మెడికల్ హాల్ నీ గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా నిర్వాహకులకు సుజాత దంపతులు కు శుభాకాంక్షలు తెలిపారు. సరసమైన ధరలకు అనుగుణంగా మందులు ప్రజలకు అందించాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కాప్రా డివిజన్ బిఆర్ఎస్ యువ నాయకుడు గోగికార్ శివకుమార్, డివిజన్ 2కు చెందిన ప్రముఖ బిఆర్ఎస్ నాయకులుకాసం మైపాల్ రెడ్డి, కుమార స్వామి, రహీం, మురళి పంతులు, బద్రుద్దీన్, మహేష్ గౌడ్, రేగళ్ల సతీష్ రెడ్డి,మల్లారెడ్డి, జయకృష్ణ, సంపత్, కొండల్ గౌడ్ ఆనంద్, గోలి శీను, గోవర్ధన్ చారి, సదాశివాచారి, హాజరై అభినందనలు తెలిపారు.





# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కార్పొరేటర్

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గంలోని మిర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో ఉన్న తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ గురువారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సమపంక్తి భోజనం చేసి, భోజన నాణ్యతను స్వయంగా గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన పదార్థాలనే ఉపయోగించాలన్నది ప్రధానంగా చెప్పారు. మధ్యాహ్న భోజనంలో శుద్ధత, పోషక విలువలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగించే సరుకుల నిల్వగదిని పరిశీలించారు. నిల్వల సమాచారం గురించి ఉపాధ్యాయుల వద్ద వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి అభిప్రాయాలు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానకి కుమారి, శాంతభాయ్, అరుణదేవి, మాధవి, దేవి, సరిత, కృష్ణమూర్తి, పద్మ, కవిత, అనితల తో పాటు కాలనీ అధ్యక్షులు మల్లేశ్ గౌడ్, మురళీ చారి, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మకుమారీస్ రాజయోగ ధ్యాన కేంద్రంలో రాఖీ వేడుకలు

**కాప్రా, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని బ్రహ్మకుమారీస్ రాజయోగ ధ్యాన కేంద్రంలో రాఖీ వేడుకలు ఆధ్యాత్మికంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ధ్యాన కేంద్ర ఇంఛార్జ్ బీకే సునీతా నిర్వహించారు. వేడుకల్లో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధ్యాన కేంద్రం ద్వారా సమాజానికి అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాఖీ పండుగ అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని, సోదరత్వ భావాన్ని, సామరస్యాన్ని పెంపొందించేదిగా నిలుస్తుందన్నారు. ఈ వేడుకల్లో కాలనీ వాసులు, ధ్యాన కేంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శుక్రవారం-08- ఆగస్టు 2025





# విజ్ఞానం పెంపొందించేందుకు ఇంటింటికీ అవగాహన కార్యక్రమం

- స్పెషల్ ఆఫీసర్ ఆర్. పుష్పలత

**దమ్మాయిగూడ, తెలంగాణ ముచ్చట్లు:**

మేడ్చల్ నియోజకవర్గంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ ఆర్. పుష్పలత నేతృత్వంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆర్జీకే కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఫేస్-1 ప్రాంతంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పొడి చెత్త, తడి చెత్త వేరు చేయడం, గృహస్థాయిలో సేంద్రీయ వ్యర్థాలను కంపోస్టింగ్ చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అంతేగాక, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మైక్ ద్వారా ర్యాలీ ప్రచారాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 20120 పూల మొక్కలు మరియు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కాలనీలోని రోడ్ల ఇరుపక్కల చెత్తను తొలగించడం, పొదలను తొలగించడం, నాలాల పూడిక తొలగింపు, భూగర్భ మురుగు కాలువల శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా, వాణిజ్య లైసెన్సుల పరిశీలన, భువన్ యాప్ ద్వారా ఆస్తుల సర్వే, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు కూడా అమలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి అడ్డంకిగా విద్యుత్ వైర్లు..

- నిర్మించుకునేందుకు వెనకాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు..
- గతంలో విద్యుత్ ఘాతంతో కుమారుడుని కోల్పోయిన కుటుంబం..
- విద్యుత్ వైర్లు పక్కకు జరపాలని అధికారులకు వేడుకలు..


**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**




విద్యుత్ వైర్లు ఇంటిపైన వేలాడుతుండటంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు బాధిత కుటుంబ సభ్యులు వెనకాడుతున్న ఘటన తల్లాడ మండలంలో నెలకొంది. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సంఘసాని శిరీష కు ఇందిరమ్మ ఇల్లు మంజూరయింది. ఈ నేపథ్యంలో తమ కున్న సొంత భూమిలో ఇంటిని నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంటి నిర్మాణంలో భాగంగా పిల్లర్లకు సంబంధించిన ఇనుప కడ్డీ సువ్వలు నిలబెట్టి బేస్ మట్టం వరకు పూర్తి చేశారు. దీంతో పిల్లర్లకు సంబంధించిన ఇనుప కడ్డీ సువ్వలు పైన విద్యుత్ వైర్లు ఉండటంతో వాటికి అంటుకునే ప్రమాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు ఆ ఇంటిని నిర్మించుకునేందుకు వెనకాడుతున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు విద్యుత్ వైర్లను జరపాలని వేడుకుంటున్నారు. గతంలో విద్యుత్ ఘాతంతో కుమారున్ని కోల్పోయాం.. గతంలో మా కుమారుడు విద్యుత్ ఘాతంతోనే మృతి చెందాడని బాధిత కుటుంబ సభ్యులు సంఘసాని మల్లిక తెలిపారు. వేరే గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా తన కుమారుడు విద్యుత్ షాక్ తో మృతి చెందాడని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని, ఆ ఇల్లు నిర్మించుకుందామని పనులు చేస్తుంటే విద్యుత్ వైర్లు అడ్డువస్తున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు ఉండటం వల్ల ఇంటి నిర్మాణ పనులను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ అధికారులు దృష్టి సారించాలి..

విద్యుత్ అధికారులు దృష్టి సారించి విద్యుత్ వైర్లను తమ ఇంటి పైనుండి జరపాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. విద్యుత్ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశామని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు జరిపే స్థోమత తమ వద్ద లేదని, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యుత్ వైర్లను జరపాలని వారు ముక్తకంఠంతో కోరుకున్నారు.

# కళ్యాణపు శ్రీనుకు నివాళులర్పించిన అడపా అనిల్ చౌదరి..

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామానికి చెందిన కళ్యాణం శ్రీను ఇటీవల మృతి చెందారు గురువారం ఆయన దర్శన కర్మ గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకులు యువనేత కడప అనిల్ చౌదరి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల నుంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాప సానుభూతి ప్రకటించారు అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ హాజరైన కార్యక్రమంలో అనిల్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు గణేషుల రవి, కళ్యాణపు వెంకటయ్య, కళ్యాణపు క్రిష్ణయ్య, గోగుల వేంకటయ్య, వీరబాబు, కొమ్మన బోయిన ప్రసాద్, శ్రీకాంత్ బుసనం. కిన్నెరా శ్రీను. రాములు పాల్గొన్నారు.

# బీసీ42 శాతం రిజర్వేషన్ల పెంపు ఒక నాటకం

- బీసీ రిజర్వేషన్లపై జూపల్లి నరేష్ విమర్శలు

**నాగారం, తెలంగాణ ముచ్చట్లు:**



మేడ్చల్ నియోజకవర్గంలోని నాగారం మున్సిపాలిటీలో బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ ఉద్యమకారుడు జూపల్లి నరేష్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో బీసీ కుల గణన పూర్తై ఆరు నెలలు గడిచినప్పటికీ, బీసీ కులాల వారీగా జనాభా వివరాలు ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదని తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లలో వర్గాలవారీగా ఎంత మొత్తాన్ని కేటాయించనుందో స్పష్టత లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలవుతున్న 27 శాతం రిజర్వేషన్లను మాత్రమే కొనసాగిస్తూ, ముస్లింలకు 10 శాతం కేటాయించి, బీసీలకు కేవలం 5 శాతం మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తుందన్న ఆరోపణ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీలు 56 శాతం ఉన్నా, ప్రతిపాదిత 42 శాతంలో 10 శాతం ముస్లింలకు కేటాయిస్తే, బీసీలకు వాస్తవంగా మిగిలే రిజర్వేషన్ 32 శాతమే అవుతుందని వ్యాఖ్యానించారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మత ఆధారితంగా కాకుండా, రాజ్యాంగంలో ఉన్న విధానాల ప్రకారం ఉత్పత్తి ఆధారిత కులాలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.



# భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులను మంజూరు

- రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కప్పర సాయి కిరణ్

**నాచారం, తెలంగాణ ముచ్చట్లు:**

ఉప్పల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ అన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ ఫేస్ టు రోడ్లు మరియు భోగర్భ డ్రైనేజీ పనులకు నిధులను మంజూరు. చేసినందుకు కాలనీ వాసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కప్పర సాయికిరణ్ గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, వర్షాకాలం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. నేటి ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయామని కాలనీవాసులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ కాలనీ అభివృద్ధి కోసం ఇప్పటివరకు కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డికి సాయి కిరణ్ లకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దంతురి రాజు గౌడ్, జెమిలా బేగం, డివిజన్ వర్కింగ్ ప్రాసిడెంట్ కోయగూర బాలరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మనోహర్, డివిజన్ వైస్ ప్రాసిడెంట్ జానీభై, పర్వతాలు, మ్యూజిబ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్, ప్రణీత్, అజిమ్, మరియు కాలనీ అధ్యక్షులు అల్తాఫ్, మురళి, విజయ్, ప్రశాంత్, కాలని వాసులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ ఎమ్మెల్యే

**మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:**

మల్కాజ్గిరి నియోజకవర్గం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బోయిన్ పల్లి లోని సౌజన్య కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజిని ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ చేతుల మీదుగా గౌతం నగర్ కు చెందిన అర్హులైన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు మొత్తం రూ, 1,36,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వెంకన్న, మేకల రామయాదవ్, బైరు అనిల్, రెబ్బ వాసు, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులున్నారు.



# కాంగ్రెస్ నుంచి యువ నేతలు బీఆర్ఎస్‌లో చేరిక

**మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:**

మల్కాజ్గిరి నియోజకవర్గంలోని వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్‌కు చెందిన కాంగ్రెస్ యువ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని, కొత్తగా చేరిన నేతలకు పార్టీ కండువాలు కప్పి స్వాగతం తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత, వైస్ ప్రెసిడెంట్ ధర్మేష్ యాదవ్, యువ నాయకులు సంపత్ యాదవ్, భాను యాదవ్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన నేతలు మాట్లాడుతూ, మల్కాజ్గిరి అభివృద్ధి కోసం మర్రి రాజశేఖర్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు నమ్మకాన్ని కలిగించాయని, భవిష్యత్ రాజకీయ ప్రయాణాన్ని బీఆర్ఎస్‌తో కొనసాగించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వెంకన్న, పంజా శ్రీకాంత్ యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# వినాయక చవితి సందర్భంగా సఫిలగూడ చెరువులో శుభ్రపరిచే పనులు ప్రారంభం

**మల్కాజ్గిరి, తెలంగాణ ముచ్చట్లు:**

వినాయక చవితి సందర్భంగా మల్కాజ్గిరి నియోజకవర్గంలోని సఫిలగూడ చెరువులో శుభ్రత పనులు ప్రారంభమయ్యాయి. మల్కాజ్గిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి దాదాపు రూ.15 లక్షల వ్యయంతో చెరువు పరిసర ప్రాంతాల్లో శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి నోడల్ అధికారి కొబ్బరికాయ కొట్టి పనులకు శుభారంభం చేశారు. డివిజినల్ ఇంజినీర్ మహేష్ మాట్లాడుతూ, బోర్ బావులు, పైపులైన్ పనులను నాణ్యతతో పూర్తి చేస్తామని, పనుల బాధ్యతను తానే స్వీకరిస్తానని తెలిపారు. బేబీ చెరువులో నిలిచిన నీటిని మోటార్ల సహాయంతో తొలగించి, శుభ్రత క్రమంగా చేపడతామని తెలిపారు.

కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని, ఈ పనులు ప్రజల సహకారంతో సకాలంలో పూర్తి చేస్తామన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కష్టాల్లో పౌల్ట్రీ పరిశ్రమ.. సమస్యల్లో పెంపకందారులు

**ఐకార్, డీపీఆర్ అధ్యయనంలో వెల్లడి**

రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగంగా ఉంటూ ఉపాధి, ఆదాయాలపరంగా పెద్దదైన కోళ్ల పెంపకం పరిశ్రమ.. పెను సమస్యలను ఎదురొంటోందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), పౌల్ట్రీ పరిశోధన డైరెక్టరేట్ (డీపీఆర్) అధ్యయనంలో వెల్లడైంది. వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు, వైద్య సిబ్బంది కొరత ఉందని, టీకాలు తగినన్ని అందుబాటులో లేవని గుర్తించింది. గుడ్లు, చికెన్ ధరలలో అస్థిరత్వం ఈ రంగం ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారినట్టు డీపీఆర్ తాజా నివేదికను విడుదల చేసింది.

5 లక్షలమందికి ఉపాధి : దేశీయంగా కోళ్లు, గుడ్ల ఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని డీపీఆర్ వెల్లడిరచింది. ఈ క్రమంలోనే ఇక్కడ 5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని పేర్కొంది. దేశంలోని కోళ్లలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా.. సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది. అయితే వాణిజ్య కోళ్ల పెంపకం ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ విధానాలతో కొనసాగుతుండగా.. నాటుకోళ్ల పెంపకం అసంఘటితంగా ఉన్నట్టు వెల్లడిరచింది. నిర్వహణలోనూ సంరక్షణ, మారెటింగ్ సమస్యలు ఎదురవుతున్నట్టు అధ్యయనం గుర్తించింది. రాష్ట్రంలో దాణా, పోషక విలువల పరిశీలన, పోషకాహార లోపాన్ని గుర్తించడానికి అవసరమైన ప్రయోగశాలలు సైతం అందుబాటులో లేవన్నది.

**నాటుకోళ్ల సంరక్షణ..** : నాటుకోళ్ల ఉత్పత్తి లాభదాయకమైనప్పటికీ వాటి సంరక్షణ సమస్యగా మారింది. వీటిని పెంచే ప్రాంతాలలో కుకలు, పిల్లులు, ఇతరత్రా జంతువుల వల్ల రైతులు పెంపకానికి వెనకాడుతున్నారు. పైగా వీటి గుడ్ల నిల్వకు శీతల గిడ్డంగుల సౌకర్యం లేక పెంపకందారులు ఎప్పటికప్పుడు వాటిని విక్రయిస్తున్నారు. అలాగే మొకజొన్న, సోయా వంటి దాణా ధరలు పెరగడంతో పెంపకం భారంగా మారింది. మార్కెట్ సైతం లాభసాటిగా లేదని వాపోతున్నారు. ఈ సవాళ్లను అధిగమించి, స్థిరమైన వృద్ధిని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ ఇండస్ట్రీకి తగినంత ప్రోత్సాహకాలు ఇవ్వాలని డీపీఆర్ శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్‌లు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# మళ్లీ పరుగు పెడుతున్న బంగారం రేట్లు

**హైదరాబాద్‌లో తులం రూ.1,02,220**



దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. మంగళవారం హైదరాబాద్‌లో 99.9 స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.820 పుంజుకొని రూ.1,02,220 వద్ద నిలిచింది. 99.5 స్వచ్ఛత కలిగిన 22 క్యారెట్ తులం విలువ రూ.750 ఎగిసి రూ.93,700 దగ్గర స్థిరపడిరది. దీంతో గత నెల 23న నమోదైన ఆల్‌టైమ్ హై రికార్డు స్థాయి దరిదాపుల్లోకి మళ్లీ గోల్డ్ ప్రైస్ వచ్చినైట్టెంది. మునుపెన్నడూ లేనివిధంగా నాడు 24 క్యారెట్ తులం రూ.1,02,330 పలికింది. 22 క్యారెట్ రూ.93,800గా ఉన్నది. ఇదిలావుంటే ఢల్లీలో 24 క్యారెట్ రేటు రూ.800 ఎగబాకి రూ.98,820గా ఉన్నట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది.

**వెండికి డిమాండ్** : మార్కెట్‌లో బంగారంతోపాటు వెండికీ ఆదరణ కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే రూ.2,000 పెరిగి కిలో ధర ఢల్లీలో రూ.1,12,000ను తాకింది. సాధారణ వినియోగదారులతో పాటు పారిశ్రామిక వర్గాల నుంచీ డిమాండ్ ఉందని, అందుకే నిన్నమొన్నటిదాకా తగ్గుతూపోయిన రేట్లు.. తిరిగి విజృంభిస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకంపనల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. ఫలితంగా ఇన్వెస్టర్లు సైతం తమ పెట్టుబడుల రక్షణార్థం.. గోల్డ్, సిల్వర్ వైపు చూస్తున్నారని నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు.

**గ్లోబల్ మార్కెట్‌లో** : అంతర్జాతీయ మార్కెట్‌లో పుత్తడి ధర కొంతవరకు తగ్గుముఖం పట్టింది. న్యూయార్క్ స్పాట్ మార్కెట్‌లో 20.95 డాలర్లు లేదా 0.62 శాతం పడిపోయి ఔన్స్ రేటు 3,352.61 డాలర్లకు పరిమితమైంది. అయితే వెండి ధర మాత్రం స్థిరంగా 37.39 డాలర్ల వద్దే ఉన్నది. కాగా, ట్రంప్ సుంకాల బెదిరింపులు ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువను రికార్డు స్థాయి కనిష్ఠాల్లోకి దిగజార్చుతున్నదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది ఇలాగే సాగితే గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంకా పెరిగే వీలుందని చెప్తున్నారు. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల నిర్ణయం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తుందని అంటున్నారు.

**మార్కెట్‌లో స్తబ్ధత** : బంగారం ధరలు పడుతూలేస్తూ ఉండటంతో రిటైల్ మార్కెట్‌లో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు తెలియజేస్తున్నారు. శ్రావణ మాసం వచ్చినా శుభకార్యాలకు తప్పక అవసరమైతేనే కొంటున్నారని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. ధరలు ఇంకా పెరిగితే రాబోయే పండుగ సీజన్‌లో విక్రయాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చన్న ఆందోళన వారిలో కనిపిస్తున్నది. ఇప్పటికే కస్టమర్లను ఆకట్టుకొనేందుకు రకరకాల ఆఫర్లను పెడుతున్నామని, అయినా స్పందన అరకొరగానే ఉంటుందని మెజారిటీ దుకాణదారులు చెప్తుండటం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్ధతకు అద్దం పడుతున్నది.

# నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టపోయాయి. ద్రవ్యసమీక్ష, ట్రంప్ సుంకాల ప్రభావం కనిపించింది. దీంతో సెన్సెక్స్ 308.47 పాయింట్లు దిగజారి 80,710.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.20 పాయింట్లు కోల్పోయి 24,649.55 వద్ద స్థిరపడిరది. చమురుగ్యాస్, బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు డీలా పడ్డాయి.




# పేటీఎంకు చైనా సంస్థ గుడ్‌బై..!

పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌కు గుడ్‌బై చెప్పింది. బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా తమకున్న మొత్తం 5.84 శాతం వాటా (3.73 కోట్ల ఈక్విటీ షేర్లు)ను రెండు విడుతల్లో రూ.3,980 కోట్లకు అమ్మేసుకున్నది. చైనా బిలియనీర్ జాక్ మా సంస్థ యాంట్ ఫైనాన్షియల్.. మంగళవారం పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌కు గుడ్‌బై చెప్పింది. బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా తమకున్న మొత్తం 5.84 శాతం వాటా (3.73 కోట్ల ఈక్విటీ షేర్లు)ను రెండు విడుతల్లో రూ.3,980 కోట్లకు అమ్మేసుకున్నది. దీంతో వన్97 షేర్ విలువ పతనమైంది. 2.38 శాతం దిగజారి బీఎస్ఈలో రూ.1,052.65 వద్ద నిలిచింది.

# రూ.500 నోట్లను వెనక్కి తీసుకోబోతున్నారా..?

**రాజ్యసభలో కీలక ప్రకటన చేసిన కేంద్రమంత్రి..!**





ఇటీవల దేశంలో ప్రస్తుతం చెలామణిలో ఉన్న రూ.500 నోట్లను వెనక్కి తీసుకోబోతున్నారంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఇదే అంశంపై రాజ్యసభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కీలక వివరాలు వెల్లడిరచారు. రూ.500 నోట్లను రద్దు చేసే ఆలోచన ఏమీ లేదని తెలిపారు. రూ.100, రూ.200తో పాటు రూ.500 నోట్లు ఏటీఎంలలో అందుబాటులో ఉంటాయన్నారు. ఏటీఎంల ద్వారా రూ.100, రూ.200 నోట్ల డినామినేషన్‌కు సంబంధించి ఇటీవల పేరుతో ఏప్రిల్ 28న సర్క్యులర్ జారీ చేసినట్లుగా ఆర్‌బీఐ ప్రభుత్వానికి తెలిపిందని తెలిపారు. దీని కింద అన్ని బ్యాంకులు, వైట్ టేబుల్ ఏటీఎం ఆపరేటర్స్ తమ ఏటీఎంలలో రూ.100, రూ.200 డినామినేషన్ న ఓట్లను క్రమం తప్పకుండా అందుబాటులో ఉంచాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. రాజ్యసభలో లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆర్‌బీఐ నిర్దేశించిన లక్ష్యం ప్రకారం.. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అన్ని ఏటీఎంలలో 75శాతం రూ.100 లేదంటే రూ.200 డినామినేషన్ బ్యాంక్ నోట్స్ కనీసం ఒక క్యాసెట్ అందుబాటులో ఉంచుతాయన్నారు. 2026 మార్చి 31 నాటికి 90శాతం ఏటీఎంలలో రూ.100, రూ.200 డినామినేషన్ నోట్స్ క్యాసెట్ కనీసం డిస్ట్రిబ్యూట్ చేస్తాయన్నారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఏప్రిల్ 2020 నుంచి మార్చి 2025 వరకు.. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో 76 కేసులను గుర్తించిందని.. వాటి నుంచి సెబీకి రూ.949.43కోట్లు రీఫండ్ (జరిమానా)గా అందిందని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ తొమ్మిది కేసులను గుర్తించిందని, ప్రధానంగా మల్టీలెవల్ మార్కెటింగ్ స్కామ్‌లకు సంబంధించినవి చెప్పారు. జనవరి 1, 2020 నుంచి జూలై 30, 2025 వరకు పెట్టుబడి మోసానికి సంబంధించిన మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 నిబంధనల ప్రకారం మనీలాండరింగ్ కింద ఈడీ 220 కేసులను విచారిస్తుందని చెప్పారు.





# ఎయిర్‌టెల్ లాభంలో భారీ వృద్ధి

భారతి ఎయిర్‌టెల్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.49,463 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5,947.9 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 28.4స, లాభం 43స పెరిగాయి. ఒక్కో కస్టమర్‌పై సగటు ఆదాయం (ఆర్పు) గత ఏడాదితో పోల్చితే రూ.211 నుంచి రూ.250కి పెరిగింది. పోస్ట్ పెయిడ్ సబ్‌స్క్రైబర్లు పెరగడంతో నిర్వహణాపరమైన లాభం 54 శాతం పెరిగినట్టు తెలిపింది.

# ఈడీ ఎదుట అనిల్ అంబానీ

రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం సెంట్రల్ ఢల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కేసుతో సంబంధమున్న బ్యాంక్ లోన్ మోసం కేసుల్లో అధికారులు అంబానీని ప్రశ్నించారు. కాగా, గ్రూప్ సంస్థలు బ్యాంకుల నుంచి మోసపూరితంగా రూ.17 వేల కోట్లకుపైగా రుణాలను తీసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే గత నెల 24న ముంబైలో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 సంస్థల కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉద్యోగులుసహా 25 మంది ఇండ్లలోనూ సెర్చ్ చేసిన సంగతి విదితమే.






# టాటా క్యాపిటల్ మెగా ఐపీవో

**డ్రాఫ్ట్ పేపర్స్ దాఖలు**
**రూ.17,200 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యం**

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ టాటా క్యాపిటల్.. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధమవుతున్నది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వద్ద రూ.17,200 కోట్ల మెగా ఐపీవో కోసం అప్‌డేట్ చేసిన డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. వీటి ప్రకారం మొత్తం 47.58 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టనున్నారు. ఇందులో 21 కోట్ల ఈక్విటీ షేర్లు ఫ్రెష్ ఇష్యూగా, 26.58 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా రానున్నాయి. కాగా, ఓఎఫ్ఎస్‌లో టాటా సన్స్ ద్వారానే 23 కోట్ల షేర్లు సేల్‌కు వస్తున్నాయి. అలాగే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను అమ్మేయనున్నది.




# గ్రీన్ కార్డు నిరీక్షణకు తెరదించనున్న అమెరికా

- ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు ప్రతిపాదించిన సర్కారు
- 20 వేల డాలర్లు చెల్లిస్తే గ్రీన్ కార్డు దరఖాస్తును వేగంగా పరిశీలిస్తామని వెల్లడి
- గ్రీన్ కార్డు దరఖాస్తుల్లో బ్యాక్ లాగ్ క్లియర్ చేయడమే లక్ష్యమని వివరణ


అమెరికాలో గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని సంవత్సరాలుగా వేచి చూస్తున్న వారికి ఊరట కల్పించేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణీత మొత్తం చెల్లిస్తే దరఖాస్తును త్వరగా పరిశీలించే అవకాశం తీసుకురానుంది. ఇందుకు అనుగుణంగా పలు ప్రతిపాదనలతో బిల్లును సిద్ధం చేసిన ప్రభుత్వం.. త్వరలో చట్టసభల్లో ప్రవేశపెట్టనుంది. అమెరికాలో తాత్కాలిక వీసాలపై ఉంటున్న భారతీయులతో పాటు చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ పౌరులు గ్రీన్ కార్డు కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఆయా దేశాల నుంచి పెద్ద సంఖ్యలో వలసలు, ఏటా నిర్ణయించే కోటా తదితర కారణాలతో ఈ ఆలస్యం జరుగుతోంది.

దశాబ్దాలుగా నలుగుతోన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టామని సెనేటర్ మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు. గ్రీన్ కార్డ్ బ్యాక్ లాగ్‌లను క్లియర్ చేయడమే లక్ష్యంగా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ విధానం తీసుకొస్తామని వివరించారు. పదేళ్లుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారు ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ (20 వేల డాలర్లు) చెల్లిస్తే అధికారులు వారి దరఖాస్తును త్వరగా పరిశీలిస్తారని చెప్పారు. తాత్కాలిక వీసాలపై అమెరికాలో ఉంటూ శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం గ్రీన్ కార్డులు జారీ చేస్తుంది. ఫ్యామిలీ ప్రిఫరెన్స్ కోటాలో 2,26,000 గ్రీన్ కార్డులు, ఉపాధి ఆధారిత కేటగిరీలో 1,40,000 గ్రీన్ కార్డులను ఏటా జారీ చేస్తారు. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7% మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. తాజా బిల్లులో దీనిని 15 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఉంటూ శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం గ్రీన్ కార్డులు జారీ చేస్తుంది. ఫ్యామిలీ ప్రిఫరెన్స్ కోటాలో 2,26,000 గ్రీన్ కార్డులు, ఉపాధి ఆధారిత కేటగిరీలో 1,40,000 గ్రీన్ కార్డులను ఏటా జారీ చేస్తారు. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7% మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. తాజా బిల్లులో దీనిని 15 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఉంటూ శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం గ్రీన్ కార్డులు జారీ చేస్తుంది.

# జమ్మూ కశ్మీర్‌లో లోయలో పడ్డ సీఆర్పీఎఫ్ వాహనం

- జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- లోయలో పడిపోయిన సీఆర్పీఎఫ్ జవాన్ల వాహనం
- ఘటనా స్థలంలోనే ముగ్గురు జవాన్ల మృతి
- మరో 10 మందికి తీవ్ర గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం
- రంగంలోకి దిగిన ఆర్మీ హెలికాప్టర్లు, కొనసాగుతున్న సహాయక చర్యలు





జమ్మూ కశ్మీర్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం లోతైన లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనలో మరో 10 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఉధంపూర్ జిల్లాలోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఈ విషాదం జరిగింది. కొండ ప్రాంతంలోని ఒక ప్రదేశానికి వెళ్తుండగా, మలుపు వద్ద డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం రోడ్డుపై నుంచి జారి పక్కనే ఉన్న లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు దుర్మరణం పాలయ్యారని అధికారులు ధ్రువీకరించారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని వెంటనే ప్రమాద స్థలం నుంచి బయటకు తీశారు. గాయపడిన 10 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించారు. ఉధంపూర్ డిప్యూటీ కమిషనర్ అభ్యర్థన మేరకు, తీవ్రంగా గాయపడిన వారిని తరలించేందుకు ఆర్మీ హెలికాప్టర్లను రంగంలోకి దించారు.

ఈ ఘటనపై స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "బసంత్‌గఢ్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ వాహనం ప్రమాదానికి గురైన వార్త కలచివేసింది. డిప్యూటీ కమిషనర్ సలోని రాయ్‌తో మాట్లాడాను. ఆమె స్వయంగా పరిస్థితిని

# ఈసీపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

- ఈసీకి వ్యతిరేకంగా అణుబాంబు లాంటి సాక్ష్యం ఉంది



ఈసీకి వ్యతిరేకంగా అణుబాంబు లాంటి సాక్ష్యం ఉందంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసీ అక్రమాలకు పాల్పడిరదని.. బీజేపీ కోసం ఈసీ ఓట్లను దొంగిలించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎగ్జిట్‌పోల్స్‌కు , ఎన్నికల ఫలితాలకు చాలా తేడా ఉందని.. మహారాష్ట్ర , హర్యానా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని తెలిపారు. ఢల్లీలో గురువారం రాహుల్ గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర , హర్యానా ఎన్నికల్లో పోలింగ్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను మాయం చేశారని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల తరువాత భారీగా పోలింగ్ నమోదయ్యిందన్నారు. మహారాష్ట్రలో 40 లక్షల రహస్య ఓటర్లను చేర్పించారని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ డేటాను ఈసీ తమకు ఇవ్వడం లేదని.. ఓటర్ల జాబితా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఐదు వేర్వేరు తేదీల్లో ఈసీ ఓట్లను దొంగిలించిందన్నారు. కర్నాటకలోని మహదేవ్‌పూర్‌లో కూడా ఓట్లను దొంగిలించారన్నారు. ఒకే ఓటరు పేరు నాలుగు పోలింగ్ బూత్‌ల్లో చేర్పించారని.. 11 వేల మంది పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకే ఇంట్లో 80 మంది ఓటర్లు ఉన్నట్టు చూపించారని.. మహదేవ్‌పూర్‌లో 11965 మంది డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఒకే ఓటరు నాలుగు రాష్ట్రాల్లో ఓటేశాడని.. ఒకే ఓటరుకు కర్నాటక, మహారాష్ట్ర, యూపీలో ఓటుహక్కు ఉందని.. తెలిపారు. మహదేవ్‌పూర్‌లో లక్షా 250 ఓట్లు దొంగిలించారు.. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# భారత పర్యటనకు వస్తున్న పుతిన్!

- రష్యా నుంచి ఆయిల్ కొంటున్నారంటూ భారత్ పై ట్రంప్ సుంకాలు
- ట్రంప్ ను పట్టించుకోని భారత్, రష్యా
- ఈ ఏడాది చివర్లో భారత్ లో పర్యటించనున్న పుతిన్!

రష్యా నుంచి ముడిచమురు కొంటున్నారనే కారణంతో భారత్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఏదో ఒక విధంగా భారత్ ను రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయకుండా చూడాలనే యోచనలో ట్రంప్ ఉన్నారు. అయితే, ఇవేవీ భారత్‌రష్యా స్నేహ బంధంపై ప్రభావం చూపలేకపోయాయి. రష్యా అధినేత ట్రంప్ త్వరలోనే భారత పర్యటనకు రానున్నారు. ఈ విషయాన్ని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ వెల్లడిరచారు. ప్రస్తుతం దోవల్ మాస్కోలో ఉన్నారు. పుతిన్ భారత పర్యటన తేదీలు ఖరారు కానప్పటికీ... ఈ ఏడాది చివర్లో ఆయన భారత పర్యటన ఉండొచ్చని 'ఇంటర్ ఫ్యాక్స్ న్యూస్ ఏజెన్సీ' తెలిపింది. భారత్ పై మరో 25 శాతం సుంకాలు పెంచుతూ నిన్ననే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై ట్రంప్ సంతకం చేశారు. ఇది జరిగిన ఒక్క రోజు వ్యవధిలోనే భారత పర్యటకు పుతిన్ వస్తున్నారనే వార్త అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.





# అమెరికా-భారత్ మధ్య పెరిగిన గ్యాప్...

- ట్రంప్ సుంకాలతో అమెరికా, భారత్ మధ్య పెరిగిన గ్యాప్
- తమ దేశ ప్రయోజనాలే ముఖ్యమంటున్న భారత్
- ట్రంప్ తీరును తప్పుబడుతున్న సొంత పార్టీ నేతలు
- అమెరికాతో బంధాలను బలోపేతం చేసుకునే దిశగా పాక్ అడుగులు
- మరోసారి అమెరికాకు వెళుతున్న పాక్ ఆర్మీ చీఫ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అదనపు సుంకాలతో భారత్ ను ఇబ్బంది పెట్టే ప్రయత్నాన్ని ఆయన చేస్తున్నారు. మరోవైపు, ఆపరేషన్ సింధూర్ తర్వాత గత జూన్ లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా వైట్ హౌస్ లో మునీర్ కు గౌరవ మర్యాదలు లభించాయి. ఆ పర్యటన సందర్భంగా ట్రంప్ కు నోబెల్ శాంతి బహుమతికి మునీర్ మద్దతు ప్రకటించారు. తాజాగా మునీర్ మరోసారి అమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న ఇండియాపై ట్రంప్ 50 శాతం సుంకం విధించారు. తొలుత సుంకాలను 25 శాతం పెంచిన ట్రంప్... భారత్ తన దారిలోకి రాకపోయేసరికి జరిమానాగా సుంకాలను మరో 25 శాతం పెంచారు. ఇదే సమయంలో పాకిస్థాన్ పై స్వల్ప సుంకాలను విధించారు. ఈ క్రమంలో అమెరికాతో భారత్ కు గ్యాప్ కొంత పెరిగింది. తమకు తమ దేశ ప్రయోజనాలే ప్రధానమని భారత్ స్పష్టం చేసింది. ట్రంప్ వ్యవహారశైలిపై భారత్ లో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్ పార్టీకి చెందిన కొందరు నేతలు కూడా ఆయన తీరును తప్పుబడుతున్నారు. నమ్మకమైన మిత్రదేశం భారత్ తో కయ్యం వద్దని హితవు పలుకుతున్నారు. మరోవైపు, ఇదే సమయంలో... అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి పాక్ ప్రయత్నిస్తోంది. భారత్, అమెరికా మధ్య కొంత మేర బలహీనపడ్డ బంధాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే జనరల్ మునీర్ మరోసారి అమెరికాకు వెళ్తున్నారు.

# ప్రధాని మోదీ పరీక్ష పే చర్చ కు గిన్నిస్ రికార్డు..



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'పరీక్ష పే చర్చ'ను 2018 నుండి విద్యా మంత్రిత్వ శాఖ 'మైగవ్' సహకారంతో నిర్వహిస్తోంది. ఇటీవల 2025లో జరిగిన ఈ ఎడిషన్‌కు "ఒక నెలలో సిటిజన్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక మంది నమోదు చేసుకున్నారు. దీంతో ఇది కేవలం ఒకే నెలలో 3.53 కోట్ల రిజిస్ట్రేషన్లతో పౌర నిశ్చితార్థ వేదికపై అత్యధిక రిజిస్ట్రేషన్‌లతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ప్రవేశించింది.ఈ మేరకు గత ఆగస్ట్ 4వ తేదీని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు అశ్విని వైష్ణవ్, జితిన్ ప్రసాద గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు గిన్నిస్ బుక్ సర్టిఫికెట్‌ను అందజేశారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు గిన్నిస్ బుక్ సర్టిఫికెట్‌ను అందజేయడం ఇది రెండవసారి. ఇంతకు ముందు 2015లో ఆయన పెట్రోలియం, సహజ వాయువు మంత్రిగా ఉన్నప్పుడు, 12.57 కోట్ల కుటుంబాలకు నగదు బదిలీని అందించడానికి "పహల్" (ఎల్‌పిజికి ప్రత్యక్ష ప్రయోజన బదిలీ) పథకం ప్రపంచంలోనే అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమంగా గుర్తింపు పొందింది. దీంతో అప్పుడు ఆయన రికార్డును క్రియేట్ చేశారు. తర్వాత మోదీ నేతృత్వంలో "పరీక్ష పే చర్చ" ఒక నెలలోనే అత్యధిక రిజిస్ట్రేషన్‌లను పొందిన పౌర నిశ్చితార్థ వేదికగా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. పరీక్షకు ముందు ప్రధాని మోదీ విద్యార్థులతో సంభాషించే ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులలో అపారమైన ఉత్సాహాన్ని నింపింది. దీంతో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చాలా మంది తల్లిదండ్రులు రిజిస్టర్ అయ్యారు. దీంతో మరోసారి ఆయన గిన్నిస్ బుక్ సర్టిఫికెట్ అందుకున్నారు. అయితే ఇప్పటివరకు, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్యక్రమాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుదక్కించుకున్నాయి. అందులో రెండు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నాయకత్వంలో అమలు చేయబడ్డాయి. వీటితో పాటు, అంతర్జాతీయ యోగా దినోత్సవం (2015), ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన కూడా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాయి.

# గుంతల రోడ్డులో పల్టీ కొట్టిన స్కూల్ వ్యాన్

### లోపలే చిక్కుకున్న చిన్నారులు

వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లా నవగ్రామ్ ప్రాంతంలో విద్యార్థులతో నిండిపోయిన ఒక స్కూల్ వ్యాన్ పల్టీ కొట్టింది. గుంతలుగా ఉన్న రోడ్డుపై వెళ్తూ ప్రమాదం చోటు చేసుకుంది. పైగా వర్షం కురవడంతో ఆ రోడ్డంతా బురద చేరి అస్తవ్యస్తంగా మారింది. పల్సొండా నుంచి లాల్బాగ్ వెళ్లే స్టేట్ హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రయాణించేందుకు అసలే వీలు లేని ఈ రోడ్డుపై ఎన్నో పెద్ద పెద్ద వాహనాలు ఇబ్బందుల నడుమ వెళ్తూ వస్తున్నాయి. ఈ క్రమంలోనే విద్యార్థుల స్కూల్ వ్యాన్ ఆ మార్గంలో ఎంతో ప్రమాదకరంగా ప్రయాణించింది. ఉన్నట్లుండి పెద్ద గుంత రాగానే అక్కడి నుంచి ముందుకు కదలలేక పూర్తిగా ఎడమ వైపుగా వాలిపోయి ఆ వ్యాన్ అదే మురుగు నీటిలో బోల్తా పడిరది. వాహనంలో ఉన్న చిన్నారులు బయటపడే మార్గం లేక బిక్కుబిక్కుమంటూ కాసేపటి వరకు లోపలే ఉండిపోయారు. గమనించిన కొందరు స్థానికులు.. వ్యాన్‌ను మళ్లీ యథాస్థితికి చేర్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అందరూ కలిసి లోపల చిన్నారులు అలా ఉండగానే ఆ వాహనాన్ని పైకి లేపారు. తర్వాత ఒక్కొక్కరిగా విద్యార్థులను బయటికి తీసి ఒక పక్కగా ఉంచారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్కూల్ వ్యాన్ బోల్తా పడడంతో నమ్మి తమ పిల్లలను ఎలా పంపేది అని గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పుడు పెద్ద ప్రమాదమే తప్పింది.. కానీ, రేపు ఏదైనా జరగరానిది జరిగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. 'ఇంకా ఎంతకాలం ఇలాగే చూడాలి? ఇలాంటి రోడ్లపై ప్రయాణించలేకుండా ఉన్నామని వాపోయారు. పైగా తమ పిల్లలను స్కూళ్లకు పంపి ఇంట్లో మనశ్శాంతిగా ఎలా ఉండగలమని స్థానిక అధికారులను నిలదీస్తున్నారు. రోడ్ల కారణంగా గాయాల పాలవుతుండటమే కాకుండా, గ్రామాల్లోని చిన్న చిన్న వీధులు కూడా పూర్తిగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు రోడ్ల పరిస్థితిపై బాహాటంగానే విమర్శిస్తున్నారు. స్కూల్ నుంచి చిన్నారులు ఇంటికి చేరుకునే వరకూ భయంతో ఎదురుచూడాల్సి వస్తుందని, వెంటనే రోడ్లను పునరుద్ధరించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ట్రిపుల్ ఆర్‌లో మహేష్ బాబు.. క్రాస్ ఓవర్ ఐడియా మామూలుగా లేదు!

ఒక సినిమా విడుదలైన తర్వాత, ఈ పాత్రను నా ఫేవరెట్ హీరో చేస్తే ఎలా ఉండేది..? అనే ఆలోచన ప్రతి ప్రేక్షకుడిలోనూ ఒక్కసారైనా వస్తుంది. కానీ, సినిమా ఒక్కసారి రిలీజ్ అయితే ఆ పాత్రలో ఇంకొక హీరోను ఊహించడం మాత్రమే చేయగలం, చూసే అవకాశం మాత్రం ఉండదు. అయితే, ఇవన్నీ పాత కాలం మాటలు. ఇప్పుడు మీమ్స్, సోషల్ మీడియా యుగం నడుస్తోంది. ఈ నూతన ట్రెండ్‌లో క్రాస్ ఓవర్ వీడియోలు పేరిట అభిమానులు తమ ఫేవరెట్ హీరోల డైలాగ్స్‌ను ఇతర సినిమాల సీన్స్‌లో మిక్స్ చేస్తూ విపరీతమైన ఎంటర్టైన్‌మెంట్‌ను క్రియేట్ చేస్తున్నారు. ఇటీవల ఒక ఫన్నీ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోలో రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ ఆర్ఆర్ఆర్ విజువల్స్‌తో, మహేశ్ బాబు నటించిన ఖలేజా సినిమాలోని టాక్సీ రాజా క్యారెక్టర్ డైలాగ్స్ మిక్స్ చేశారు. ఈ క్రాస్ ఓవర్ వీడియోలో ఖలేజాలోని ఎవర్‌గ్రీన్ డైలాగ్స్‌ను ఆర్ఆర్ఆర్ యాక్షన్ సీన్స్‌తో ఫన్నీగా కట్ చేశారు. ఈ వీడియో దాదాపు 2.30 నిమిషాల నిడివితో ఉండగా, ఇది సినిమాటిక్ కామెడీ పండిస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంటుంది.

ఇక ఖలేజా విషయానికి వస్తే.. : ఈ సినిమా 2010లో విడుదల కాగా, అప్పట్లో ఆశించిన స్థాయిలో రెస్పాన్స్ దక్కించుకోలేకపోయింది. అయితే ఆ తర్వాత టీవీ ప్రసారాల ద్వారా సినిమా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ముఖ్యంగా మహేశ్ బాబు చెప్పిన డైలాగులు, ఆయన కామెడీ టైమింగ్ సోషల్ మీడియాలో మీమ్స్ టెంప్లేట్స్‌గా మారాయి. కొంతమంది మీమ్ క్రియేటర్లకు ఖలేజా టెంప్లేట్‌లు లేకపోతే మీమ్స్ క్రియేట్ చేయలేనంతగా అయిపోయింది! ఈ క్రేజ్‌ను మేకర్స్ కూడా గమనించి ఖలేజా సినిమాను రీసెంట్‌గా రీరిలీజ్ చేశారు. ఈసారి మాత్రం థియేటర్లలో సూపర్ రెస్పాన్స్ దక్కించుకుంది. ఇక ప్రస్తుతం మహేశ్ బాబు రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ పాన్‌ఇండియా ప్రాజెక్ట్ చేస్తున్నాడు. %ూావీదీ% 29 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రియాంక చోప్రా కూడా పవర్ ఫుల్ రోల్ పోషిస్తుంది.

## నేను ప్రమోట్ చేసింది గేమింగ్ యాప్స్ మాత్రమే : విజయ్ దేవరకొండ



బెట్టింగ్ యాప్ కేసు విచారణలో భాగంగా అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యలయం ముందుకు హాజరైన విషయం తెలిసిందే. తాజాగా ఈ విచారణ ముగిసింది. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం కేసులో దాదాపు నాలుగున్నర గంటలపాటు విచారణ జరుగగా.. ఈ యాప్స్‌లో ప్రమోషన్స్‌లో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఈడీ విజయ్‌ను విచారించినట్లు సమాచారం. అయితే ఈ విచారణ అనంతరం విజయ్ దేవరకొండ మీడియా ముందుకు వచ్చి మాట్లాడాడు. బెట్టింగ్ యాప్ కేసులో నా పేరు రావడంతో విచారణకు పిలిచారు. నేను ప్రమోట్ చేసింది గేమింగ్ యాప్స్ మాత్రమే. గేమింగ్ యాప్‌కి, బెట్టింగ్ యాప్‌కి అసలు సంబంధమే లేదు. రెండు వేరు వేరు. గేమింగ్స్ యాప్స్ అనేవి కంప్లీట్‌గా లీగల్. సుప్రీం కోర్టుచే గుర్తించబడినవి. ఇవి టాక్స్ కడతాయి. జీఎస్‌టీ ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఉంటాయి. నా బ్యాంకు లావాదేవీల వివరాలన్నీ ఈడీకి సమర్పించా. నేను ప్రమోట్ చేసిన ఎ23 యాప్ తెలంగాణలో ఓపెన్ కాదు. నేను లీగల్ గేమింగ్ యాప్‌ను మాత్రమే ప్రమోట్ చేశా. దానికి సంబంధించిన ఒప్పందం వివరాలన్నీ ఈడీకి సమర్పించాను అంటూ విజయ్ చెప్పుకోచ్చాడు. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే ప్రకాష్ రాజ్‌ని ఈడీ విచారించగా, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మిలకు కూడా నోటీసులు జారీ చేసింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).

## 'పుష్ప 2' తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్..


**సీఎస్‌కు నోటీసులు**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ తొక్కిసలాటలో ఒక మహిళ మరణించగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయంపై అందిన ఫిర్యాదును పరిశీలించిన జాతీయ మానవ హక్కుల కమిషన్, సినిమా థియేటర్ వద్ద తగిన భద్రతా చర్యలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణిస్తూ, మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని అలాగే ఈ సంఘటనపై పూర్తి నివేదికను సమర్పించాలని తెలంగాణ పోలీసులను ఆదేశించింది. కాగా.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.




## బ్యాడ్‌గాళ్స్... కానీ మంచోళ్లు..!


అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బ్యాడ్‌గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' ఉపశీర్షిక. రోహన్ సూర్య, మొయిన్ కీలక పాత్రధారులు. మున్నా ధూలిపూడి దర్శకుడు. బుధవారం ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్‌ను దర్శకులు చందూ మొండేటి, కృష్ణచైతన్య ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఎంతో మంది అమ్మాయిల నిజజీవిత కథలతో స్ఫూర్తిపొంది ఈ సినిమా తీశాను. తల్లిదండ్రులు అమ్మాయిలను అమ్మోరులా ధైర్యంగా పెంచాలని చెప్పే కథ ఇది. పాఠశాల విద్యార్థినులకు స్వీయరక్షణ కల్పించేలా ఒక సబ్జెక్ట్‌ను పెట్టాలి. ఇలాంటి అంశాల్ని చర్చిస్తూ సందేశాత్మకంగా సాగుతుంది' అన్నారు. ప్రతీ ఫ్యామిలీ చూడాల్సిన చిత్రమిదని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, సాహిత్యం: చంద్రబోస్, నిర్మాతలు: శశిధర్ నల్లా, సోమనర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్, దర్శకత్వం: మున్నా ధూలిపూడి.




## అభిమానుల ప్రేమే రక్షాకవచం

79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఫీనిక్స్ ఫౌండేషన్, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మెగాబ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో అగ్ర నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువ హీరో తేజ సజ్జా, కథానాయిక సంయుక్తమీనన్ అతిథులుగా హాజరయ్యారు. బుధవారం నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో 800 మంది వరకు పాల్గొన్నారని, సేకరించిన రక్తాన్ని భారత సైన్యానికి విరాళంగా అందించబోతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'రక్తదానం అనగానే నా పేరు గుర్తుకురావడం పూర్వ జన్మ పుణ్యఫలంగా భావిస్తున్నా. సోషల్‌మీడియాలో వచ్చే విమర్శలపై మీరెందుకు స్పందించరని చాలా మంది అడుగుతుంటారు. అలాంటి అనవసర విషయాలపై నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, నాపై అభిమానులు చూపించే ప్రేమే నాకు రక్షణ కవచాలుగా భావిస్తాను. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. రక్తదానం వంటి మంచి కార్యక్రమాలు ఎవరు చేసినా నన్ను పిలిస్తే తప్పకుండా వచ్చి మద్దతునిస్తాను' అన్నారు.



## మంచు మనోజ్ కొత్త సినిమా.. పోస్టర్ విడుదల



టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి. ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్‌సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు%ా% ఢల్లీలో పెరిగాడు%ా% ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు. సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. టైటిల్ 'డేవిడ్ రెడ్డి'. ఇది 1897 1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా" అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు "డేవిడ్ రెడ్డి" అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

## ప్రేమలో మృణాల్ ఠాకూర్..?

దక్షిణాది అగ్రనటుడు ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉందనే వార్తలు ప్రస్తుతం ముంబయి సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వీరిద్దరి డేటింగ్‌పై ఆంగ్ల మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ జంట ప్రేమబంధానికి కొద్ది మాసాల క్రితమే బీజం పడిరదని అంటున్నారు. ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ధనుష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని నెలల క్రితం చెన్నైలో జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ మధ్య తొలిసారి పరిచయం ఏర్పడిరదని, అక్కడే వీరి ప్రేమప్రయాణానికి తొలి అడుగులు పడ్డాయని అంటున్నారు. ధనుష్ సోదరీమణులు కార్తీక, విమల గీత ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఠాకూర్‌ను ఫాలో కావడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. ధనుష్ తన కుటుంబ సభ్యులకు మృణాల్ ఠాకూర్‌ను పరిచయం చేశారని ఆంగ్ల మీడియాలో వార్తలొచ్చాయి. తమ ప్రేమబంధంపై ప్రస్తుతం ఈ జంట గోప్యతను పాటిస్తున్నారని, సరైన సమయంలో అందరికి తెలియపరిచే ఆలోచనలో ఉన్నారని సమాచారం. గత కొద్దిరోజులుగా మీడియాలో వస్తున్న డేటింగ్ వార్తలపై ఈ తారలిద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. దాంతో డేటింగ్ రూమర్స్ నిజమేనని అభిమానులు భావిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in